# నిరుపమం

(విశ్వసాహితి కథల పోటీలో తృతీయ బహుమతి కథ, 1971)

లోపల అడుగుపెట్టగానే రమకి కనిపించిన దృశ్యం.... ఒక టేబిల్ దగ్గిర కొంతమంది కూర్చుని పేకాడుతున్నారు. ఇంకో టేబిల్ దగ్గిర నలుగురు కేరమ్స్ ఆడుతున్నారు. మరో టేబిల్ దగ్గిర.... అక్కడే ఆగి పోయింది రమదృష్టి. ఆ బల్లమీద వయ్యారంగా కూర్చుని కబుర్లు చెప్తోంది ఒకావిడ. చుట్టూ అయిదారుగురు కుర్చీల్లో కూర్చుని ఆవిడ కబుర్లు వింటున్నారు. ఆవిడ తొడిగిన చేతుల్లేని జాకెట్టు, కట్టిన పల్చటి చీర రెండూ తెల్లటి తెలుపు. ఆ పల్చని టెర్లిన్ చీరలోంచి జాకెట్టు మెడలోపల ఎంత కిందికి దిగిందో చక్కగా కనపడుతోంది. చెవులకున్న పెద్ద పెద్ద ముత్యాల లోలకులు తల తిప్పినప్పుడల్లా భుజాలని ముద్దాడుతున్నాయి. నడినెత్తిమీద ఉన్న సిగ ఆవిడ ముఖానికి అందంగానే ఉంది.

"హల్లో! కొత్త మెంబర్ని తీసుకొస్తున్నట్టున్నారే!" అంటూ ఆవిడ తమవేపే రావడం చూసి పక్కకి తిరిగి జయవైపు చూసింది రమ.

"ఔనండీ! ఈవిడ మిస్ రమ. కొత్తగా వచ్చిందీ ఊరు. ఇక్కడ ఉమెన్స్ కాలేజీలో లెక్చరరుగా జాబ్ దొరికింది. నాల్రోజు లయింది వచ్చి. మాకు దూరపు బంధువు కూడా." పరిచయం ముగించింది జయ.

"నమస్తే! ఎక్కడుంటున్నారు ? జయ వాళ్ళింట్లోనేగా" చనువుగా అడిగింది ఆవిడ.

"కాదండీ, నాతో మా అమ్మకూడా ఉంది; జయా వాళ్ళింటి వెనక సందులో ఒక ఇల్లు అద్దెకి తీసుకున్నారు."

"అలాగా!" అందంగా తల ఊపిందావిడ.

"అన్నట్టు రమా! ఈవిడెవరో నేను నీకు చెప్పనేలేదు కదూ! ఈవిడ మిసెస్ రావు.... స్నేహశీలి."

రమని అందరికీ పరిచయం చేసిన తర్వాత "పేకాడదామా ?" అంది జయ.

"లైబ్రరీ ఉందన్నావుగా. నేను కాస్సేపు మేగజైన్సు చూస్తాను. నువ్వాడుతూ ఉండు."

"సరే! అయితే! అదిగో అదే రూమ్....వెళ్ళి చూడు. నేను కూడా రావాలా ?"

"అబ్బే! అక్కర్లేదు."

ఆ రూమ్‌లో మిసెస్‌రావు తప్ప మరెవరూ లేరు. ఏదో పుస్తకం కోసం వెతుకుతున్న ఆవిడ రమని చూసి చిన్నగా నవ్వింది.

"రండి. మీక్కూడా నాలాగే పుస్తకాల పిచ్చి ఉందా ?"

జవాబుగా నవ్వి ఊరుకుంది రమ.

రమ ఒక్కొక్క పుస్తకమే తీసి చూస్తుంటే ఆవిడ ఏవేవో కబురు చెప్తూనే ఉంది. మాటల్లో వాళ్లిల్లెక్కడో చెప్పి, అప్పుడప్పుడు తమ యింటికి వస్తూ ఉండమని ఆహ్వానించింది రమని.

కొద్దిపాటి పరిచయంతోనే ఆవిడ తనతో చక్కగా కలుపుగోలుగా

మాట్లాడటంతో ఆవిడమీద ఇష్టం ఏర్పడి నవ్వుతూ అంది. "తప్పకుండా వస్తాను మీ ఇంటికి."

ఇంటికి వెళ్తూ దోవలో జయని అడిగింది "ఆవిడ పేరు....అదే మిసెస్ రావు పేరు ఏమిటి ?"

ముఖం చిట్లించింది జయ "నిరుపమ"

"చాలా బావుంది కదూ పేరు. మనిషికి తగ్గట్టే ఉంది పేరు కూడా."

వంకర నవ్వు నవ్వింది జయ "పేరూ, రూపం బావుంటే చాలా? గుణం బావుండొద్దూ?"

అనుమానంగా చూసింది రమ "అంటే?"

"ఆవిడ పేరెత్తితేనే చిరాకు నాకు. అసలావిణ్ణి చూడగానే తెలుస్తుంది ఎవరికైనా ఆవిడ క్యారెక్టరు మంచిది కాదని...."

"ఛ! అలా అంటావేమిటి ? చాలా మంచిదిలా ఉంటే!"

అసలావిడ వేషంచూసే ఆవిడ గుణాలెలా ఉంటాయో ఊహించుకోవచ్చే! తేల్చి పారేసింది జయ.

"భలేదానివే! ఆవిడ అలా అలంకరించుకుందని, అంత మాత్రం చేత గుణం మంచిది కాదని ఎలా చెప్పగలవు నవ్వింది రమ.

"కాదు రమా! నువ్వీ ఊరికి కొత్తదానివి. నీకు తెలియదు. కొన్ని రోజులుపోతే నీకే తెలుస్తుంది. ఈ ఊళ్ళో ఎవరి నడిగినా ఆవిడ గుణమెలాటిదో చెప్తారు.

అసంతృప్తిగా తల ఆడించింది రమ.

జయ మాటలు నమ్మ బుద్ధి కావట్లేదు.

నిరుపమ శీలాన్ని అనుమానించలేక పోతోంది.

*   *   *

"వాస్తా నొస్తా నంటూ చాలా రోజులు చేశారు. ఇప్పటికి తీరిక చిక్కినదన్నమాట మీకు" రమ కెదురుగా సోఫాలో కూర్చుంటూ అంది నిరుపమ.

నవ్వి ఊరుకుంది రమ.

నిరుపమ బయటికొచ్చినప్పుడెలా ఉంటుందో ఇంట్లోనూ అలాగే నవ నాగరికంగా ఉంటుందని అంచనా వేసుకున్న రమ ఆవిడని చూసి ఆశ్చర్యపోయింది.

ఆవిడ కాఫీ అందిస్తున్నప్పుడు రెండు చేతులకి వేసుకున్న ఎర్రని గాజులు గలగలమన్నాయి.

మెడకూడా బయటికి వచ్చినప్పుడున్నట్టు బోసిగా లేదు.

కట్టుకున్న నేత చీరలో చాలా హుందాగా కనిపించింది.

ఆవిడ కళ్ళు ఏదో చెప్పాలని తొందర పడుతున్నట్టున్నాయి.

"ఏమిటలా చూస్తున్నారు ? ఒక నిమిషమాగి అంది నిరుపమ.

సిగ్గు పడింది రమ.

"కొంతమందిని చూస్తుంటే వాళ్ళు మనకు కొత్తవాళ్ళే అయినా ఎంతో ఆత్మీయుల్లా అనిపిస్తుందెందుకో. నాకు మిమ్మల్ని చూసినప్పటినించీ అలాగే ఉంది. మీ దగ్గిర నాకు మొహమాట పడాలని లేదు. నాకీ ఊళ్ళో ఎంతో మంది తెల్సు. కానీ నిజమైన స్నేహితులు ఒకళ్ళు కూడా లేరు. మీతో పరిచయమైన తర్వాత, ఆ కొరత తీరిపోయిందని పిస్తోంది, నవ్వుతూ అంది నిరుపమ.

మనసులోనే ఆవిడకి కృతజ్ఞత చెప్పుకుంది రమ.

"నేనిప్పుడెలా ఉన్నానో ఎప్పుడూ అలాగే అలంకరించుకోవా లనిపిస్తుంది నాకు. కానీ బయటికి వచ్చినప్పుడు నా అలంకరణ దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. అటువంటి అలంకరణలో నన్ను చూసి మీరేమనుకుంటుంటారు? అందరూ అనుకున్నట్టేనా!"

ఒక్కక్షణం మాట్లాడలేక పోయింది రమ.

తర్వాత మెల్లగా అంది.

"నేనెప్పుడూ మీ గురించి అలా అనుకోలేదు."

నిరుపమ కళ్ళల్లో తృప్తి మెరిసింది.

"నాకు అతిఫేషన్‌గా అలంకరించుకోడం ఇష్టం లేదు. కానీ నేను బయటకొచ్చినప్పుడల్లా అలా అలంకరించుకోడానికి కారణం మావారు.... ఓ....సారీ! నా గురించి నేను చెప్పుకుంటూ మిమ్మల్ని బోర్ కొడుతున్నానేమో!"

"నన్నే కనక మీరు నిజమైన స్నేహితురాలిగా భావిస్తే అలా అడిగేవారు కాదు." చిరుకోపం ప్రదర్శించింది రమ.

"ఓ నామీదే బాణం వేశారే!" రమచేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కింది నిరుపమ.

ఒక్కక్షణమాగి మళ్ళీ తనే అంది "మిమ్మల్ని ఎంత దగ్గర వారుగా భావించకపోతే ఈ విషయాలు మీతో మాట్లాడతాను."

ఔనన్నట్టుగా చూసింది రమ.

"మాకు, దేనికి ఏ ఇన్విటేషన్ వచ్చినా ఆయన బలవంతంగా నన్ను పంపిస్తూ ఉంటారు. వెళ్తే యిద్దరం వెళ్దాం. లేకపోతే అసలు మానేద్దాం అంటే వినరు. తనకేదో పనుందనో, తల నొప్పనో,

ఆఫీసులో వర్కుందనో ఏదో ఒక అడ్డంకి చెప్పి తను రావడం మాని నన్ను బలవంతంగా పంపుతారు. వెళ్ళేదాకా ప్రాణంతీస్తారు. ఇలా, ఆయనొచ్చినా రాకపోయినా నేను అన్నిచోట్లకీ వెళ్ళడం, తిరగడం చూసి ఊళ్ళో నలుగురూ నానా రకాలుగానూ మాట్లాడుతారు."

నిరుపమ కళ్ళల్లో అంతవరకూ ఉన్న వెలుగు పోయి విచారం అలుముకుంది.

జాలిగా నిరుపమ ముఖంలోకి చూసింది రమ.

"నలుగురూ నా గురించి చెడ్డగా చెప్పుకుంటున్నారని ఆయనతో అన్నాను కూడా. 'అందరూ ఏమనుకుంటే నీ కెందుకు? నువ్వేమీ తప్పు పని చెయ్యనప్పుడు ఈవాళ్ళ కెందుకు భయపడటం? మెత్తగా వుండే వాళ్ళనీ, భయపడేవాళ్ళనీ లోకువుగా చూస్తుంది లోకం అన్నారాయన. భారంగా నిట్టూర్చింది నిరుపమ.

ఏదో కథ వింటున్నట్లే అనిపించింది రమకి.

నిజంగానే ఆవిడమీద చెప్పలేనంత జాలివేసింది.

"పోనీలెండి. మీవా రన్నట్లు మీరేమీ తప్పు చెయ్యనప్పుడు నలుగురూ మీ గురించి ఏదో అనుకుంటున్నారని బాధపడటమెందుకు? మనసు పాడుచేసుకోడం ఎందుకు? పైగా, మీరు మీవారికి నచ్చినట్లు, ఆయన చెప్పినట్లు నడుచుకుంటున్నారు. అందులో తప్పేముంది? ఆయన చెప్పినట్లు నడుచుకోకపోతే ఆయనకి కోపం రాదూ? అప్పుడు ఊళ్ళోవాళ్ళొచ్చి మీవారి కోపం పోగొడతారా? మీ కాపురం నిలబెడతారా? ఎందుకొచ్చిన లోకం అండీ? పనికిమాలిన లోకం?" ఓదార్పు మాటలు చెప్పింది రమ.

"నిజం చెప్పారు. ఒక్కరైనా నన్ను అర్థంచేసుకునేవాళ్ళు దొరికినందుకు నాకు నిజంగా సంతోషంగా వుంది."

తృప్తిగా చిరునవ్వు నవ్వింది నిరుపమ.

*　　　　*　　　　*

రమ, జయతో కబుర్లు చెప్తూ మెల్లిగా నడుస్తోంది.

పక్కనించి రయ్యిన ఓ కారు దూసుకుపోయింది.

నవ్వింది జయ.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అడగకుండా ఉండలేకపోయింది రమ.

"నిరుపమా దేవిగారి షికార్లు చూసి. ఇప్పుడు మనపక్క నించో కారు వెళ్ళింది....దాన్లో ఆవిడ వుంది .... దాన్లో ఆయన కూడ ఉంది. నువ్వు చూడలేదా?"

"లేదు. చూడలేదు. ఉంటే ఏం?"

"అది మూర్తిగారి కారు. డ్రైవ్ చేస్తున్నది ఆయనే. పక్కన కూచుని వెళ్తోందీ మహాతల్లి. వాళ్ళాయన్ని ఇంట్లో కూచోపెట్టి తాళంవేసినట్టుంది." వేళాకోళం ధ్వనించింది జయ మాటల్లో.

"రేపు మూర్తిగారమ్మాయి పుట్టినరోజు. డిన్నరికి పిల్చారు మమ్మల్ని. ఏదో వంకచెప్పి, ఏ పనిమీదో బయటికి వెళ్ళిపోయి నన్ను బలవంతంగా వాళ్ళింటికి డిన్నర్‌కు పంపుతారేమో మావారు. అనుమానంగానే వుంది నాకు" అంటూ నిరుపమ నిన్న సాయంత్రం తనతో అన్నమాటలు గుర్తుకొచ్చాయి రమకి. అందుకే ఇవాళ అదే జరిగిందని ఊహించుకో గలిగింది. కానీ, నిరుపమ తనతో చెప్పుకున్న బాధంతా జయతో చెప్పబుద్ధికాలేదు.

చిన్నగా నిట్టూర్చి మెల్లిగా అంది "తెలిసీ తెలియని మాట

లెందుకు జయా? నిజా నిజాలు నీకు తెలియవు. అటువంటప్పుడు అనవసరంగా ఆవిడ గురించి మాటలనుకోడం ఎందుకు?"

..."బలేదానివే ఇంక నిజానిజాలేమిటి? ఎదురుగుండా వున్న నిజం కనిపిస్తుంటే?" ఆశ్చర్యంగా రమవైపు చూసింది జయ.

మాట్లాడాలనిపించక మౌనంగా వుండిపోయింది రమ.

* * *

రాత్రి ఏడే అయినా నిశ్శబ్ధంగా ఉందా రోడ్డు.

ఆ సందులో వున్న కొద్ది ఇళ్ళు తలుపులు మూసుకునే ఉన్నాయి. తన కొలీగ్ శాంత ఇంట్లో పేరంటానికి వెళ్ళి వస్తోంది రమ.

ఆ వీధిలోనో నిరుపమ ఇల్లు.

"ఎలాగో ఇటువైపు వచ్చాను కదా, నిరుపమ దగ్గరో రెండు నవల్సు తీసుకుని వెళ్తే, రెండురోజులు కాలక్షేపం అవుతుంది" అన్న ఆలోచనతో నిరుపమ ఇంటి ముందుకు రాగానే రమ కాళ్లు ఆగి పోయాయి.

మెల్లిగా వరండా మెట్లెక్కింది రమ.

అప్పుడు షడన్‌గా గుర్తొచ్చింది. "శుక్రవారం నేను ఊరెళ్తాను. వారంరోజులు పోయాక వస్తాను. మా అమ్మ దగ్గిరికి వెళుతున్నాను," అని నిరుపమ నాలుగురోజుల క్రిందట చెప్పినమాట.

ఆ రోజు శుక్రవారం. ఆవిడ వూళ్లో ఉండివుండదు. వెళ్ళిపోదామని వెనక్కి తిరుగుతుండగా లోపల్నించి నవ్వులు వినిపించాయి.

ఒకవేళ ఊరెళ్ళలేదేమో, ఇంట్లోనే ఉందేమో అన్న అనుమానంతో ఆగింది రమ.

లోపల్నించి యెవరిదో ఆడ గొంతు వినిపించింది "భలేవాడివే!"

"మరేమిటనుకున్నావ్!"

అది రావుగారి గొంతు. గుర్తుపట్టింది రమ.

ఆ స్త్రీ ఎవరు? ఆశ్చర్యంతో అడుగు వెయ్యడం మర్చిపోయింది. రావుగారి గొంతు మళ్ళీ వినిపించింది "నేనేం చెప్తే అది నమ్మే స్తుంది నిరుపమ. నేనే బలవంతపెట్టి ఫ్యాషన్‌గానూ, స్టయిల్‌గానూ ఉండేటట్టు చేస్తుంటాను. తను వెళ్ళనంటున్నా నేనే బలవంతపెట్టి, ఒక్కదాన్నీ అన్నిచోట్లకీ, అందరిళ్ళల్లో పార్టీలకీ పంపుతూ వుంటాను. ఎందుకనుకున్నావ్! అలా ఉండడం మూలాన అందరూ గుణం మంచిదికాదని, ప్రవర్తన మంచిదికాదని నిరుపమని గురించి చెడ్డగా చెప్పుకుంటారు కదా!"

"చెప్పుకుంటున్నారు కూడా" మధ్యలో స్త్రీ కంఠం.

"ఆ....అలా చెప్పుకోవాలనే నేను కోరేది. దాని మూలాన అందరికీ నామీద జాలి, సానుభూతి ఎక్కువ అవుతాయి. ఎప్పుడైనా నేను నీతో తిరగడం చూసినా 'ఔను మరి! భార్య అటువంటిది. ఏం చేస్తాడు పాపం! అందుకే ఇలా తిరిగుతున్నాడు' అనుకుంటారు. అంతే గానీ నన్ను గురించి చెడ్డగా చెప్పుకోరు అవునా? కాదా?"

ఇద్దరి నవ్వులతో ఆ గది నిండిపోయింది.

మరి వొక్క క్షణంకూడా అక్కడ నిలబడలేక గిరుక్కున వెనక్కి తిరిగింది రమ.

నిరుపమమీద జాలితో మనసు కరిగిపోయింది.

★